పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి సారించాలి



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

అంబర్‌పేట్: నియోజకవర్గంలో పారిశుద్ధ్య సమస్యలపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కలిపించాలన్నారు. పారిశుద్ధ్యంపై మెరుగైన పని తీరు ప్రదర్శించే సిబ్బందిని ప్రోత్సహించే బహుమతులు అందిస్తామన్నారు. బహిరంగంగా చెత్త డంపింగ్ యార్డులను దశలవారీగా తొలగించే చర్యలను చేపట్టాలన్నారు. కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్‌యాదవ్, పద్మావెంకట్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, అమృత, మహాలక్ష్మి, డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్ఓ జ్యోతిబాయి, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

అంబర్‌పేట్: పేదింటి ఆడపిల్లల వివాహానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారాక్ పథకాల కింద 116 మందికి రూ. 1.16 కోట్ల చెక్కులను లబ్ధిదారులకు శనివారం అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్, వై. అమృత, తహసీల్దార్ వీరాబాయిలతో కలిసి ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాలతో తెలంగాణలోని దాదాపు ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకుంటే తనవంతు సహకారం అందిస్తానన్నారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని వినతి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన నిరుద్యోగ జేఏసీ చైర్మన్

కాచిగూడ: బ్యాక్‌లాగ్ ఉండకుండా గురుకుల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో నిరుద్యోగ ప్రతినిధులు శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నీల వెంకటేష్ మాట్లాడుతూ.. గురుకుల టీచర్ అభ్యర్థులు అన్ని పోస్టులకు పరీక్షలు రాశారని, ఎక్కువ మంది ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపిక అవుతున్నారన్నారు. దీంతో మిగతా ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్స్ ఏర్పడుతున్నాయన్నారు. మొదట పైస్థాయి నుంచి క్రిందిస్థాయి పోస్టులను భర్తీ చేయాలని ఆయన సూచించారు. కొన్ని కారణాలతో ఉద్యోగానికి ఎంపికైన వ్యక్తి ఉద్యోగం చేయడం ఇష్టం లేకపోయినా, ఒకటి కన్నా ఎక్కువ పోస్టులకు ఎంపిక కావడంతో సదరు ఉద్యోగంలో చేరలేకపోతే తదుపరి మెరిట్‌లో ఉన్న వ్యక్తిని ఎంపిక చేస్తే చాలా మంది అభ్యర్థులకు న్యాయం జరుగుతుందన్నారు. సీజీ ప్రీతంకుమార్, బాలరాజ్, శ్రీనివాస్, హస్మబేగం, కవిత, ఉపేందర్, లాస్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలపై 10 శాతం పన్ను ఉపసంహరించుకోవాలి

నల్లకుంట: కర్ణాటక ప్రభుత్వం అక్కడి హిందూ దేవాలయాలపై 10 శాతం పన్ను విధించేందుకు తీసుకొచ్చిన హిందూ ధార్మిక సంస్థలు, ధార్మిక ధర్మాదాయ బిల్లు హేయమైనదని బీజేపీ తెలంగాణ ధార్మిక పరిషత్ కన్వీనర్ సూర్యప్రకాష్ అన్నావజ్జుల, కో-కన్వీనర్ నిరంజన్ దేశాయ్ నేడొక ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బిల్లు అక్కడి శాసన మండలిలో వీగిపోవడం కాంగ్రెస్ పార్టీకి చెంప పెట్టులాంటిదన్నారు. ఈ బిల్లుతో కాంగ్రెస్ పార్టీ కొత్తగా తన దిగజారుడు తనాన్ని బయట పెట్టుకుందని విమర్శించారు. డీకే శివకుమార్, సిద్ధరామయ్య నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం మతపరమైన ఎండోమెంట్ బిల్లును తీసుకొచ్చిందని ఆరోపించారు. హిందూ ఆలయాల నిర్వహణకు భక్తులు ఇస్తున్న విరాళాలను కాంగ్రెస్ ప్రభుత్వం తన అవసరాలకు వినియోగించుకుంటుందని మండిపడ్డారు. హిందూ దేవాలయాలను అస్థిరపరిచే కుట్రలో భాగంగానే అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బిల్లును అసెంబ్లీలో ఆమోదించిందని దుయ్యబట్టారు. చర్చిలు, మసీదులపై పన్నులు వేసే ధైర్యం అక్కడి ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా ఈ బిల్లు కర్ణాటక ప్రభుత్వ తీరు సనాతన ధర్మాన్ని కాపాడే హిందూ దేవాలయాల మీద కక్షపూరిత చర్యగా అభివర్ణించారు. ఈ చర్య భారత దేశ కీర్తి ప్రతిష్టకు విఘాతం కలించేలా ఉందని పేర్కొన్నారు. అక్కడి ప్రభుత్వం వెంటనే స్పందించి హిందూ ఆలయాలపై విధించే పన్ను చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చర్యపై సనాతన ధర్మాన్ని పరిరక్షించే మేధావులతో త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వివరించారు.

ఈస్ట్‌జోన్ డీసీపీకి సన్మానం



కాచిగూడ: ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శనివారం శివసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.సుదర్శన్, గౌట్ గణేష్‌ల ఆధ్వర్యంలో పార్టీనేతలు అంబర్‌పేట్‌లోని డీసీపీ కార్యాలయంలో ఆయనను కలిసి సన్మానించారు. డీసీపీకి ఛత్రపతి శివాజీ మహారాజ్ ప్రతిమను బహుకరించారు.

పేద విద్యార్థులకు చేయూత భేష్



విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్స్ అందజేస్తున్న ఏఎల్‌వోలు

చిక్కడపల్లి: స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులకు సాయం చేయడం మంచి పరిణామమని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌లు శిరీష, సరళ అన్నారు. అప్స స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లిలోని ఆంధ్ర విద్యాలయ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు, సానిటరీ నాప్‌కిన్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా శిరీష, సరళ మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం నరసమ్మ, బొట్టు రమేష్, నీరజ, శ్రావణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరీబాయికి ఘనంగా నివాళి

లిబర్టీ: జీవితాంతం దళిత బహుజనుల అభ్యున్నతి కోసం జె.ఈశ్వరీబాయ్ పని చేశారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి చొప్పరి బాలకృష్ణ అన్నారు. ఉద్యమమే ఊపిరిగా పోరాటమే లక్ష్యంగా పీడితుల కోసం పని చేశారని గుర్తు చేశారు. ఈశ్వరీబాయి వర్ధంతి సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళితుల ఆర్థిక సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజలు, స్త్రీల విద్య , ఉద్యోగం కోసం ఎంతగానో పని చేశారని తెలిపారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ప్రజా సంక్షేమం కోసం శ్రమించారని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి గీతారెడ్డి, గొల్లపల్లి దయానందరావు పాల్గొన్నారు.

సత్యనారాణయస్వామి వ్రతాలు



చిక్కడపల్లి: మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం వివేక్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహికంగా సత్యనారాణయస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం ఈవో ఎం.దేవనాథం, అర్చకులు వెంకటాద్రి, వేణు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంత్‌సేవాలాల్ జీవితం స్ఫూర్తిదాయకం



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సంత్ సేవాలాల్ మహరాజ్ జీవితం స్ఫూర్తిదాయకమని ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సేవాలాల్ సేనా గ్రేటర్ అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం లంబాడీతండా బస్తీలో బంజారా ఆరాధ్య దైవం సద్గురు శ్రీ సంతు సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నేత ముఠా జైసింహ, సేవాలాల్ వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్ తదితరులు సంత్ సేవాలాల్ సేవలను కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ భిక్షునాయక్, రఘురామ్ రాథోడ్, రేఖనాయక్, దేవేందర్‌నాయక్, ఓబానాయక్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నల్లకుంట: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు(వీహెచ్) అనారోగ్యంతో స్థానికంగా ఓ ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, సీనియర్ నాయకుడు హరినాథ్‌రెడ్డి తదితరులు శనివారం ఆస్పత్రికి వెళ్లి వీహెచ్‌ను పరామర్శించారు.

అల్పాహారం పంపిణీ

చిక్కడపల్లి: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో పోటీ పరీక్షల అభ్యర్థులు, పేద ప్రజలకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏడుకొండ సీతయ్య కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమకు తోచిన రీతిలో సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు జీకే రమణ, దేవేందర్ బండా పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం



రితీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం సుందరయ్య పార్కులో యోగా గురువులు డాక్టర్ ఓంప్రకాష్ ఆధ్వర్యంలో యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువులు శివ, అపర్ణల ఆధ్వర్యంలో యోగా వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తు బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, కేన్సర్, లివర్, హార్ట్ తదితర వ్యాధుల నివారణకు యోగా ట్రిక్స్‌ను నేరిపించారు. ఈ సందర్భంగా పద్మకాలనీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు దోహదపడిన టి.రితీష్‌కుమార్, యోగా గురువులను ఘనంగా సన్మానించారు. వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటస్వామిగౌడ్, మాజీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, వి.నాగభూషణం, సంపత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాజు, ఆర్. సంతోష్‌గౌడ్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో సంత్ రవిదాస్‌కు ప్రత్యేక స్థానం



రవిదాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేత గౌతమ్‌రావు

కాచిగూడ: కవిగా, సంఘ సంఘసంస్కర్తగా సంత్ రవిదాస్ చరిత్రలో ప్రత్యేకమైన స్థానాన్ని పొందారని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. సంత్ రవిదాస్ జయంతి సందర్భంగా శనివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ.. వారణాసిలో జన్మించిన రవిదాస్ తన జీవితంలో ఆధ్యాత్మిక గురువుగా నిలిచారని కొనియాడారు. పార్టీ నేతలు చింతల రాంచంద్రారెడ్డి, ఎ.సూర్యప్రకాష్ సింగ్, వినోద్‌యాదవ్, కాసం వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, సందీప్ సాయి, కృష్ణగౌడ్, రాహుల్‌చంద్ర, కేశబోయిన శ్రీధర్, విజయ తులసి, జ్యోతి, శిరీష పాల్గొన్నారు.

టీజీఓస్ నేతలకు సత్కారం



సన్మానిస్తున్న డాక్టర్ ముత్యాల సత్యనారాయణగౌడ్

కాచిగూడ: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాస్‌రావు, జనరల్ సెక్రటరీగా సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్యామ్‌లు నూతనంగా ఎన్నికైన సందర్భంగా టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, భాగ్యనగర్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముత్యాల సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు శనివారం వారిని కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. సొసైటీ కార్యదర్శి మల్లారెడ్డి, రాజేశ్వర్, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రషీదా, సంధ్యారాణి, విష్ణువర్ధన్‌రెడ్డి, అమరజ్యోతి, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న రచయిత డీ జాన్ జయవాహి

నల్లకుంట: మానవ సేవయే మాధవ సేవా అని అంతర్జాతీయ విద్యా అవార్డు గ్రహీత, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, రచయిత డీ జాన్ జయవాహి అన్నారు. షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో 'సాయి మై మెజిషియన్' ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన జాన్ జయవాహి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ.. జాన్ జయవాహి ఏవా కార్యక్రమాల్లో భాగంగా చిన్న వయసులో లైంగిక దాడికి గురైన బాలికలు, సంఘం నుంచి వెలివేసిన మహిళలను దత్తత తీసుకుని వారికి ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పిస్తున్నారన్నారు. ప్రకృతి వైపరిత్యాలు జరిగినప్పుడు సాయి బిన ఫౌండేషన్ ద్వారా ఆమె అభాగ్యులకు ఆపన్న హస్తం అందిస్తారని చెప్పారు. సంస్థాన్ పాలక మండలి ప్రతినిధులు ఆధ్యాత్మిక గురువు జాన్ జయవాహిని బాబా శేష వస్త్రంతో సన్మానించారు. సాయిబాబా సంస్థాన్ పాలక మండలి ప్రతినిధులు, బాబా భక్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

లిబర్టీ: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాం అనుసరిస్తున్న అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలని కోరుతూ ఈ నెల 29న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఆల్ ఇండియా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గం ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా తెలంగాణలోని 33 జిల్లాల్లో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆకాశానంటే అందమైన భవనాలు నిరన్మిస్తున్నప్పటికి భవన నిర్మాణ కార్మికుల జీవితాల్లో వెలుగు లేదన్నారు. కార్మికుల అడ్డాల వద్ద మౌలిక వసతులు, షెల్టర్లు, మంచినీటి సౌకర్యం, మూత్రశాలలు లేవన్నారు. కార్మికులకు కార్డులు ఇవ్వాలని అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, చేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు.

'విజయ సంకల్ప యాత్ర'తో ప్రతిపక్షాలకు దడ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గౌతమ్‌రావు

కాచిగూడ: బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి, పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు అన్నారు. ఈ నెల 26న జరిగే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. శనివారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో మాట్లాడుతూ... 26న జూబ్లీహిల్స్, ఖైరతాబాద్‌కు విజయసంకల్ప యాత్ర చేరకుంటుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు బీజేపీ ముందుకొచ్చిందన్నారు. కాసం వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి: బీజేపీ



మాట్లాడుతున్న పూస రాజు, శేషసాయి

ముషీరాబాద్: మార్చి 1వ తేదీన ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించే బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రచార కమిటీ కన్వీనర్ పూస రాజు, కో కన్వీనర్ శేషసాయి కోరారు. శనివారం బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో విజయ సంకల్ప యాత్రపై ముఖ్య నాయకుల కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నిర్వహించే విజయ సంకల్ప యాత్ర ప్రచార కమిటి కన్వీనర్ పూస రాజు, కో కన్వీనర్ శేషసాయిల నియమితులయ్యారు. వీరిని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ నియమించారు. ఈ సందర్భంగా పూస రాజు, శేషసాయి మాట్లాడుతూ... విజయ సంకల్పయాత్రలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, నగర, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. రాంనగర్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గం ఆరు డివిజన్ల బీజేపీ ప్రచార కమిటీ కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



చెప్పల్‌బజార్‌లో మరమ్మతులు చేయిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమరమేష్‌యాదవ్

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లోని సెయింట్ మీరా స్కూల్ దగ్గర డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత పగిలిపోయి స్థానిక ప్రజలు, వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. సమస్యను గుర్తించిన స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ శనివారం డ్రైనేజీ మ్యాన్‌హోల్ ప్రాంతాన్ని సందర్శించి సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బందిని పిలిపించి వెంటనే మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు. జలమండలి ఏఈ భావన, బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్ పనులను పర్యవేక్షించారు.

అంబేడ్కర్ భావజాలంపై దాడిని సహించం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంబేడ్కరిజం, అంబేడ్కర్ భావజాలంపై దాడులు చేస్తే సహించబోమని పలువురు వక్తలు అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ దళిత మహా సభ ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఇజంపై దాడి, ప్రజాస్వామ్యవాదుల కర్తవ్యం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, గడ్డ విజయ్‌రావు, ప్రముఖ కవి డాక్టర్ పసునూరి రవీందర్, డీబీఎఫ్ జాతీయ కన్వీనర్ పి.శంకర్, ఆర్.పి.ఐ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తదితరులు ప్రసంగించారు. ప్రముఖ కవి, గాయకులు మాస్టర్ జీ, ప్రముఖ గేయ రచయిత జయరాజు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు, కోలా జనార్ధన్, చేతన్, అంబేడ్కరిస్టు రాందాసు, నేతల రమేష్ పాల్గొన్నారు.

టూరిజం కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించేంత వరకు పోరాటం చేస్తానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖలో కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించినందుకు కూనంనేని సాంబశివరావును శనివారం టూరిజం కాంటాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, ఉద్యోగులు హిమాయత్‌నగర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో కలిసి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తనని హామీ ఇచ్చినట్లు రాజమౌళి తెలిపారు. నేతలు జ్యోతి, రచన, రాజ్యలక్ష్మి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరప్ప

హిమాయత్‌నగర్: బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెన్న ఈశ్వరప్ప నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్‌ల సమక్షంలో నియామక పత్రాన్ని అందజేసినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రైతులపై కాల్పులు హేయం: ఐఎఫ్‌టీయూ



రాంనగర్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న నాయకులు

ముషీరాబాద్: రైతులపై కాల్పులు చేయడాన్ని నిరసిస్తూ ఉభయ భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి అనురాధా మాట్లాడుతూ... రైతాంగం నిరవధికంగా తమ డిమాండ్లపై పోరాడుతోందన్నారు. అందులో భాగంగా హరియాణా, పంజాబ్ సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న రైతులపై పాశవికంగా, బీజేపీ నేతృత్వంలోని హరియాణా రాష్ట్ర ప్రభుత్వం కాల్పులు జరిపిందన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం ఆదేశంతో జరిగిందని కాల్పుల్లో 24 ఏళ్ల యువ రైతు శుభకరన్ సింగ్‌ను పోలీసులు పొట్టన పెట్టుకున్నారన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, జడ సీతారామయ్య, సత్యనారాయణ, మంగ్ల, శివబాబు, పీడీఎస్‌యూ నాయకులు మహేష్, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి యార్డ్ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి (50) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెట్ బాల్ టోర్నీ విజేత అంబేడ్కర్ కళాశాల జట్టు



విజేత నిలిచిన అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ కాచిగూడలో ఈ నెల 23, 24వ తేదీల్లో జరిగిన ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ నెట్ బాల్‌మెన్ చాపియన్‌షిప్ టోర్నమెంట్‌లో అంబేడ్కర్ డిగ్రీ కళాశాల జట్టు గెలుపొందినట్లు కళాశాల డైరెక్టర్ రిషికాంత్ తెలిపారు. ఓయూ ఐసీటీ సెక్రటరీ డాక్టర్ కె.కృష్ణా, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సోమేశ్వర్, ఫిజికల్ డైరెక్టర్ శ్రావణ్ పాల్గొని విద్యార్థులను ప్రొత్సహించారు. అవంతి కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు, ఇంజినీరింగ్ విద్యార్థులతో తలపడి 6-5 తేడాతో విజయం సాధించారన్నారు.

పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలి

హిమాయత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాఠశాల భవనానికి మరమ్మతు పనులను చేపట్టాలని కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్ గౌడ్ కోరారు. శనివారం హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్-15లో ఉన్న ప్రభుత్వ పాఠశాలను ఆమె సందర్శించారు. సిబ్బంది పాఠశాల భవనం చాలా పాతదై, ఒక చెట్టు ఎప్పుడైనా కూలే పరిస్థితి ఉందని వారి దృష్టికి తెచ్చారు. ఇందుకు సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.